సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 26 । జనవరి । 2024

I



వైఎస్ జయమ్మ జీవితం అందరికీ ఆదర్శం

వైఎస్ జయమ్మ జీవితం అందరికీ ఆదర్శమని వైఎస్సార్ సతీమణి వైఎస్ విజయమ్మ పేర్కొన్నారు.

-IIలో



28 నుంచి క్రీడా పండుగ

రాజంపేటలో ఈనెల 28వ తేదీ నుంచి జాతీయ స్థాయి బాలికల కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు అన్నమయ్య జిల్లా డీఈఓ శ్రీరామ్ పురుషోత్తం తెలిపారు.

-IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.260
రెండోరకం	రూ.100	రూ.186

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 142 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

పంచాయతీ కార్యదర్శిపై విచారణ

రామసముద్రం: మండలంలోని కుదురుచీమన పల్లె పంచాయతీ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి విధులకు హాజరుకాకుండా నిర్లక్ష్యం చేయడం, ప్రజలకు అందుబాటులో లేకపోవడం తదితర ఆరోపణలపై డీఎల్‌పీవో ధనలక్ష్మి విచారణకు ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఏవో కుమారి విచారణ చేపట్టారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు ఆమె తెలిపారు. ఈవోపీఆర్‌డి సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి విచారణలో పాల్గొన్నారు.

గవర్నర్ తేనీటి విందుకు ఆహ్వానం



ముద్దం రాముడు

కమలాపురం: కమలాపురం పట్టణానికి చెందిన జిల్లా బెస్ట్ మ్యూజిక్ టీచర్ అవార్డు గ్రహీత ముద్దం రాముడు 26న గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొననున్నారు. శుక్రవారం విజయవాడలోని రాజ్ భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆధ్వర్యంలో జరిగే తేనీటి విందుకు హాజరు కావాలని రాముడుకు గవర్నర్ డిప్యూటీ సెక్రటరీ ఆహ్వానం పంపారు. గురువారం కమలాపురంలో రాముడు మాట్లాడుతూ గవర్నర్‌ను కలిసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.

నూతన నియామకం



కె.రాముడు



నాయని పెద్దన్న

మైదుకూరు: ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘంలో వైఎస్సార్ జిల్లా మైదుకూరుకు చెందిన ఇరువురికి స్థానం లభించింది. మైదుకూరుకు చెందిన రజక సంఘం నాయకుడు కె.రాముడు (గాలి మిషన్) బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు.కృష్ణ (పూసల) బలిజ సంఘం నాయకునిగా ఉన్న నాయని పెద్దన్నను సంఘం జిల్లా కార్యదర్శిగా నియమించారు. ఆ మేరకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.రెడ్డిబాబు గురువారం ఉత్తర్వులు అందజేశారు.

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట

తొండూరు: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళాభ్యున్నతికి పెద్ద పీట వేశారని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం వైఎస్సార్ జిల్లా తొండూరులోని గంగాదేవిపల్లె క్రాస్ రోడ్డు వద్ద నిర్వహించిన వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత మన పిల్లల చదువులు ఏ విధంగా ఉన్నాయో ఆలోచించాలన్నారు. పలు పథకాలు ప్రవేశపెట్టి మీకు ఆసరా కల్పిస్తున్న జగనన్న ప్రభుత్వానికి అండగా నిలవాలని ప్రతి అక్కను, ప్రతి చెల్లెమ్మను పేరు పేరునా కోరుకుంటున్నానని పేర్కొన్నారు. అనంతరం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి 397గ్రూపులకు సంబంధించి 3975మంది డ్వాక్రా మహిళలకు రూ.3,52,33,641ల వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును పంపిణీ చేశారు.

అతివకు ఆసరా

- ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేసిన సీఎం వైఎస్.జగన్
- జిల్లాలో నాలుగు విడతల్లో రూ.841 కోట్ల చెల్లింపు
- 24,948 సంఘాల మహిళలకు ఆర్థిక ప్రయోజనం



బి.కొత్తకోట: ఎన్నికల్లో హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక ఏరుదాటాక తెప్ప తగలేయడం నాయకులకు మామూలే. అందులో మహిళా సంఘాలకు చెందిన మహిళల రుణాలను మాఫీ చేస్తానని హామీ ఇచ్చి 2014 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు హామీని తుంగలో తొక్కారు. అయితే ఇచ్చిన హామీని ఇచ్చినట్టుగా అమలు చేసి చేతల్లో చూపించారు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి. 2019 ఎన్నికల్లో ఎన్నికల సమయానికి ప్రతి మహిళ బ్యాంకు ద్వారా తీసుకున్న రుణం ఎంత పెండింగ్‌లో ఉందో అంతే మొత్తాన్ని మాఫీ చేసి, చెల్లించిన రుణ ం తిరిగి చెల్లిస్తామని ఇచ్చిన హామీని సీఎం జగన్ అక్షరాల అమలు చేశారు.

రూ.841.87 కోట్ల రుణవిముక్తి

గత ఎన్నికల్లో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నాలుగు విడతల్లో అమలు చేశారు. 2019 ఏప్రిల్ 11 నాటికి మహిళా సంఘాల సభ్యుల బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాల్లో ఎంత రుణం చెల్లించాల్సి ఉందో ఆ మొత్తం రుణాన్ని ప్రభుత్వం చెల్లించే విధంగా నిర్ణయం తీసుకుంది. ఈ రుణాలను సభ్యులు నెలవారీగా చెల్లించగా, ప్రభుత్వం విడతల వారీగా రుణాలన్నీ మాఫీ చేసి తిరిగి సభ్యులకు చెల్లించింది. అన్నమయ్య జిల్లాలో 24,948 సంఘాలకు చెందిన 2,49,480 మంది మహిళలకు రూ.841.87 కోట్లను చెల్లించారు. ఈ స్థాయిలో రుణమాఫీ ఇంతవరకు ఏ ప్రభుత్వంలోనూ జరగలేదు. మహిళా సంఘాల వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి ఇంత భారీ ప్రయోజనం మహిళలకు కలగడం ఇదే ప్రథమం. ఈ రుణ చెల్లింపులతో మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తోంది.

సున్నా వడ్డీతో చేయూత

రుణమాఫీయే కాకుండా మహిళలు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఒక్కో సంఘానికి రూ.5 నుంచి రూ.20 లక్షల వరకు రుణాలను బ్యాంకులు మంజూరు చేస్తున్నాయి. ఈ రుణాలపై వడ్డీ విధిస్తున్నాయి. రుణాల కంతులను నెలవారీగా చెల్లిస్తున్న మహిళలకు ప్రభుత్వం భరోసా ఇస్తూ వారు చెల్లించిన వడ్డీ సొమ్మును తిరిగి చెల్లిస్తోంది. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు ఎంతో ప్రయోజనం చేకూరుతోంది. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా జిల్లాలో నాలుగు విడతల్లో రూ.230.4 కోట్లను ప్రభుత్వం భరించి సంఘ సభ్యులకు చెల్లించింది. దీనితో బ్యాంకు రుణాలను పూర్తిగా వడ్డీలే ని రుణాలను అందిస్తూ పేద మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం బాటలు వేస్తోంది.

ఆసరా చెల్లింపులు

మొదటి విడత సంఘాలు: 22,168
సొమ్ము: రూ.198.17 కోట్లు
రెండో విడత సంఘాలు: 22,229
సొమ్ము: రూ.197.48 కోట్లు
మూడో విడత సంఘాలు: 24,948
సోమ్ము: రూ.223.11
నాలుగోవిడత: 24,948
సొమ్ము: రూ.223.11 కోట్లు

సున్నా వడ్డీ చెల్లింపులు

మొదటి విడత సంఘాలు: 18,450
సొమ్ము: రూ.44.09 కోట్లు
రెండో విడత సంఘాలు: 20,730
సొమ్ము: 59.69 కోట్లు
మూడో విడత సంఘాలు: 21,641
సొమ్ము: 62.62 కోట్లు
నాలుగో విడత సంఘాలు: 22,000
సొమ్ము: రూ.64 కోట్లు

రూ.88 వేలు వచ్చాయి



2014 ఎన్నికల్లో మహిళా సంఘాల రుణాలు మాఫీ చేస్తామని చంద్రబాబు నమ్మించి మోసం చేశారు. గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన సీఎం జగన్ మాట నిలబెట్టుకుని మా రుణాలను మాఫీ చేసి నాలుగు విడతల్లో మంజూరు చేశారు. జగన్ రుణమాఫీ చేయడం వల్ల నాకు రూ.88 వేల లబ్ది కలిగింది. ఈ సొమ్మును బ్యాంకుకు చెల్లించినా తిరిగి నాకు ప్రభుత్వం అందించింది.

–భూదేవి, సంఘ సభ్యురాలు, కురబలకోట

రూ.59 వేలు రుణమాఫీ



సంఘం ద్వారా తీసుకున్న రుణ ంలో రూ.59,548 మాఫీ అయ్యింది. ఈ సొమ్మును సీఎం వైఎస్.జగన్ నాలుగు విడతల్లో చెల్లించారు. భర్త దూరమై ముగ్గురు పిల్లలతో జీవిస్తున్న తనకు ప్రభుత్వం రుణం మాఫీ చేయడం కుటుంబానికి ఎంతో ఆసరా అయ్యింది. పిండి మిషన్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా.

–హసీనా, సంఘసభ్యురాలు, తంబళ్లపల్లె

పక్కాగా హామీ అమలు



సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు మహిళా సంఘాలకు పూర్తిస్థాయిలో రుణమాఫీ అమలు చేశారు. 2019 ఏప్రిల్ 11 నాటికి సంఘాల్లో ఎంత రుణ ం నిల్వ ఉందో అంతే సొమ్మును నాలుగు విడతల్లో చెల్లించారు. ఈ మాఫీతో మహిళా సంఘాలు మరింత ఆర్థిక పరిపుష్టిని సాధిస్తున్నాయి.

–సత్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ, రాయచోటి

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్



ఓటు ప్రాధాన్యతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు

రాయచోటి టౌన్: ఓటు హక్కు మనకు రాజ్యాంగం కల్పించిన వరంలాంటిదని అన్నమయ్యజిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్ అన్నారు. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లాకేంద్రమైన రాయచోటి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. శ్రీ సాయి శుభ కల్యాణ మండపంలో ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జనవరి 25వ తేదీన ఓటు హక్కుపై, ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్ల మన భవిష్యత్తును నిర్ణయించుకునేందుకు ఓటు హక్కు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఓటు ద్వారా ఒక మంచి ప్రజాప్రతినిధిని ఎంచుకునే అవకాశం ఉంటుందన్నారు. ఆర్‌డీవో రంగస్వామి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజాస్వామ్యం బలపడాలంటే ఓటు కీలకమైనదన్నారు. బాధ్యత కలిగిన ప్రతి పౌరుడు ఓటు హక్కును పొందాలని సూచించారు. అనంతరం సమావేశానికి హాజరైన వారితో ఓటు హక్కును నమోదు చేసుకుని, దానిని సద్వినియోగం చేసుకోవాలంటూ ప్రతిజ్ఞ చేయించారు. అలాగే కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకున్న వారికి ఎపిక్ కార్డులు అందజేశారు. వృద్ధ ఓటర్లను సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రేమంత్ కుమార్, ఎంఈవో వెంకట శివారెడ్డి, శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు కె. శ్రీనివాస రాజు, పాఠశాల, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగంపై ప్రతిజ్ఞ

రాయచోటి: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటుహక్కు వినియోగంపై జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు పోలీసు అధికారులతో గురువారం జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఓటుకున్న ప్రాముఖ్యతను ఎస్పీ వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా ఎస్పీ డాక్టర్ విబి రాజ్‌కమల్, ఏఆర్ డీఎస్పీ మహబూబ్‌బాషా, జిల్లా ఎస్‌ఈబీ ఈఎస్ శ్రీనివాసులు, ఎస్‌ఈబీ ఏఈఎస్ రవి, సీఐలు, ఏఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ: భారతదేశ పౌరులమైన మేము, ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో, దేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలను స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రాభవాన్ని నిలబెడతామని, మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని ఇందుమూలంగా ప్రతిజ్ఞ చేస్తున్నాం.

28న రాష్ట్రస్థాయి చెస్ టోర్నీ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు తదితరులు

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని రామచంద్రాపురంలో ఉన్న మాంటిస్సోరీ జగతి ఇంటర్నేషనల్ స్కూల్లో ఈనెల 28వ తేదీ ఆదివారం రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ లేవాకు నితీష్‌రెడ్డి తెలిపారు.దీనికి సంబంధించిన కరపత్రాలను గురువారం కరస్పాండెంట్‌తో కలిసి డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, నగర మేయర్ సురేష్ బాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్‌ను కడపలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. విజేతలకు లక్ష రూపాయలు ప్రైజ్ మనీ పెట్టడం అభినందనీయమని అన్నారు. మాంటిస్సోరీ జగతి ఇంటర్నేషనల్ స్కూల్ కరస్పాండెంట్ లేవాకు నితీష్‌రెడ్డి మాట్లాడుతూ టోర్నీకి హాజరైన వారికి స్టేట్ లెవెల్ సర్టిఫికెట్, మెడల్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇంకా ఎవరైనా రిజిస్టర్ చేసుకోవాలంటే 9346240540 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సురేంద్ర, చందు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైలకు పదోన్నతులు

కడప అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా పోలీసుశాఖలో 2009 బ్యాచ్‌కు చెందిన ఎస్‌ఐలకు పదోన్నతులు కల్పించారు. ఈ క్రమంలో వైఎస్ఆర్ జిల్లాలో 9 మందికి సీఐలుగా పదోన్నతి కల్పిస్తూ కర్నూలు– కడప రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్ ఉత్తర్వులను జారీ చేశారు. ఎ.మధుమల్లేశ్వర్ రెడ్డి, ఎస్.రోషన్, ఎస్.కుళ్లాయప్ప, సి.గోపినాథ రెడ్డి, ఎం.రాజగోపాల్, హెచ్.కృష్ణంరాజు నాయక్, డి.హాజీవలి, ఆర్.మోహన్, కడప రైల్వేస్ కె.రారాజులు పదోన్నతి పొందారు. వీరికి త్వరలో పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు.

ఉత్తమ అధికారులకు గవర్నర్ సత్కారం





అనూరాధ, దీప్తి మాధురిలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

కడప సెవెన్‌రోడ్స్/మైదుకూరు: ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం–2024లో ఉత్తమ సేవలు అందించిన మైదుకూరు ఏఈఆర్‌ఓ (తహసీల్దార్) అనూరాధ, కడప నగరం 13వ డివిజన్‌లో వార్డు ఉమెన్ ప్రొటెక్షన్ సెక్రటరీగా పని చేస్తూ పోలింగ్ కేంద్రం 215 బీఎల్‌ఓగా విధులు నిర్వర్తించిన ఎం.దీప్తి మాధురిలు ఉత్తమ అధికారులుగా ఎంపికయ్యారు. కొత్త ఓటర్ల నమోదు, మరణించిన, వలస వెళ్లిన, డబుల్ ఎంట్రీల తొలగింపు, సవరణలు చేయడంలో వీరు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం విజయవాడలో గవర్నర్ అబ్దుల్ నజీర్ వీరిని ఘనంగా సత్కరించారు. ఏఈఆర్‌ఓ అనూరాధకు రూ. 15 వేల నగదు పురస్కారం, సర్టిఫికెట్, మెమెంటో అందజేశారు. బీఎల్‌ఓ విధులు నిర్వర్తించిన దీప్తి మాధురికి రూ. 10 వేల నగదు పురస్కారం, సర్టిఫికెట్, మెమొంటో అందజేసి అభినందించారు.

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం



గణతంత్ర వేడుకల నిర్వహణకు ముస్తాబైన పోలీస్ పరేడ్ మైదానం

గణతంత్ర దినోత్సవ వేడుకలకు అన్నమయ్య జిల్లా రాయచోటిలోని పోలీస్ పెరేడ్ మైదానం ముస్తాబైంది. వేడుకల నిర్వహణకు అనువుగా మైదానాన్ని అలంకరించారు. అతిథులు, విద్యార్థులు, ఎండలో ఇబ్బందులు లేకుండా షామియానాలను ఏర్పాటు చేశారు. శుక్రవారం రాయచోటిలోని పోలీస్ పెరేడ్ మైదానంలో భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు ఉదయం 8.45 గంటలకు వేడుకలు ప్రారంభం కానున్నాయి. వేడుకల్లో ముఖ్య అతిథి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. పోలీసుల కవాతు, మార్చ్ ఫాస్ట్, కలెక్టర్ సందేశం ఉంటుంది. అలాగే పోలీసు జాగిలాల విన్యాసాలు, జిల్లా ప్రగతిని చాటే శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేయనున్నారు. ప్రాంగణంలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఎగ్జిబిషన్, స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా ఎస్పీ బి.క్రిష్ణారావుల ఆదేశాల మేరకు పోలీస్ పరేడ్ మైదానంలో వేడుకల నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు చేశారు.



పోలీస్ పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన షామియానాలు

- గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం, మున్సిపల్, తహసీల్దార్ కార్యాలయ భవనాలు రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణతో మెరిసిపోతున్నాయి. గణతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొనే అధికారులు, సిబ్బంది సమన్వయంతో వేడుకలను విజయవంతం చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ గురువారం ఒక ప్రకటనలో కోరారు.



విద్యుద్దీప కాంతుల్లో కలెక్టర్ కార్యాలయం

–రాయచోటి

ఆర్టీసీకి పండుగ

- 383 ప్రత్యేక బస్సులు నడిపిన అధికారులు
- రూ.75లక్షల సంక్రాంతి ఆదాయం

మదనపల్లె సిటీ: సంక్రాంతి పండుగకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడపటం ద్వారా అన్నమయ్య జిల్లా ఆర్టీసీ రికార్డు స్థాయిలో ఆదాయాన్ని పొందింది. ఈనెల 10వతేదీ నుంచి 22వతేదీ వరకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయగా, పండుగ ముందు, తర్వాత సాధారణ ఛార్జీలకే బస్సులు నడిపింది. ఈ ఏడాది పండుగకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయడానికి ఎక్కువ మంది మొగ్గు చూపడంతో ఈ ఆదాయం సాధ్యమైంది. దీంతో ఆర్టీసీ ప్రయాణికులకు మరింత చేరువైంది. అన్నమయ్య జిల్లా పరిధిలోని మదనపల్లె వన్, టు డిపో, పీలేరు, రాయచోటి, రాజంపేట, డిపోల పరిధిలో 294 బస్సు సర్వీసులను వివిధ ప్రాంతాలకు నడిపారు. పొరుగు జిల్లాలు, ఇతర రాష్ట్రాలు, నగరాలకు ప్రత్యేక బస్సులు నడిపారు. ఇవి విజయవాడ, హైదరాబాదు, చెన్నై, విశాఖపట్టణం, నెల్లూరు, తిరుపతి, అనంతపురం తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించాయి. దీంతో సుమారు రూ.58 లక్షలు ఆదాయం వచ్చింది.



ఆర్టీసీ డిపోలోని బస్సులు

బెంగళూరుకు ప్రత్యేక సర్వీసులు

జిల్లా నుంచి అధికంగా బెంగుళూరుకు ప్రత్యేక సర్వీసులు నడిపారు. బెంగుళూరు ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు అధికంగా ఉండటంతో ప్రత్యేకంగా 89 బస్సు సర్వీసులు నడిపారు. ఈ మార్గంలో రికార్డు స్థాయిలో ఆదాయం వచ్చింది. సుమారు రూ.16 లక్షలు ఆదాయం వచ్చింది.

ప్రైవేటు దోపిడీకి అడ్డుకట్ట: సంక్రాంతి పండుగకు ప్రైవేటు ట్రావెల్స్ వారు ప్రయాణికులను అడ్డంగా దోచుకోవడం సర్వసాధారణం. అయితే పండుగకు ప్రత్యేక బస్సులను సాధారణ చార్జీలతో ఏర్పాటు చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు కూడా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రైవేటు ట్రావెల్స్ దోపిడీ బారిన పడకుండా చర్యలు తీసుకున్నారు.

అన్నమయ్య రీజియన్ పరిధి:

డిపోలు	ప్రత్యేక బస్సులు	ఆదాయం	కి.మీటర్లు	ఈపీకే	ఓఆర్
అయిదు	294	58,94,480	136553	43.17	78

బెంగుళూరు ప్రత్యేక సర్వీసులు

ప్రత్యేక బస్సులు	ఆదాయం	కి.మీటర్లు	ఈపీకే
89	16,53,389	40578	40.75

ప్రయాణికులు ఆదరించారు:



సంక్రాంతి పండుగకు ఆర్టీసీ జిల్లా వ్యాప్తంగా మంచి ఆదాయం లభించడం సంతోషం. పండుగ సందర్భంగా ఆర్టీసీ బస్సులను ప్రయాణికులు బాగా ఆదరించారు. పండుగకు ముందు పండుగ తర్వాత కూడా ప్రత్యేక బస్సులు నడిపాం. ప్రయాణికులు ఇచ్చిన ప్రోత్సాహంతో మున్ముందు ఆర్టీసీ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేలా చర్యలు తీసుకుంటాం.

–రాము, ప్రజారవాణా అధికారి, రాయచోటి

లోకపావని.. పాహిమాం

– ఘనంగా ఈశ్వరీదేవి పీఠం పర్యటన


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఈశ్వరీదేవి పీఠాధిపతి

రాజంపేట టౌన్ : రాయలసీమలో తొలిసారిగా రాజంపేటలోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గురువారం ఈశ్వరీదేవి ఆస్థాన పీఠం ధార్మిక పర్యటన కార్యక్రమాన్ని విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రాచగుండ్ల లక్ష్మీప్రసన్నాచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీ ఈశ్వరీ మహాదేవి మఠం మఠాధిపతి శ్రీవీరశివకుమారస్వామి ఆధ్వర్యంలో ఆలయ పురోహితులు పూజా కార్యక్రమాలను చేపట్టారు. విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

నిమ్మనపల్లె : ముష్టూరు పంచాయతీ చల్లావారిపల్లెకు చెందిన పాశం గణేష్(26) మరికొందరితో కలిసి బుధవారం బోయకొండ సమీపంలో పేకాట ఆడేందుకు వెళ్లాడు. అక్కడ కొందరితో గొడవపడ్డాడు. నిమ్మనపల్లె మండలానికి చెందిన మునిరాజా అలియాస్ పులి, వెంకటరమణ అలియాస్ సింహా, సోము, ప్రకాష్, ముని అనే ఐదుగురు గణేష్‌పై దాడిచేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

భాకరాపేట చెక్ పోస్టు వద్ద రూ.70 లక్షలు పట్టివేత

సిద్దవటం : మండలంలోని భాకరాపేట చెక్‌పోస్టు వద్ద గురువారం వాహనాలను తనిఖీ చేస్తుండగా రూ. 70లక్షల నగదును పట్టుకున్నామని ఎస్‌ఐ పెద్దఓబన్న తెలిపారు. తాడిపత్రికి చెందిన వెంకటనారాయణరెడ్డి తిరుపతిలో ఉన్న తన స్థలాన్ని అమ్మితే వచ్చిన రూ. 70 లక్షల నగదును తన కారులో తీసుకొని తాడిపత్రికి వెళుతున్నారన్నారు. కారును భాకరాపేట చెక్ పోస్టు వద్ద తనిఖీ చేయగా అందులో రూ. 70 లక్షలు నగదు లభించింది. అందుకు సంబంధించి ఎలాంటి అధారాలను చూపక పోవడంతో నగదును సీజ్ చేసి ఇన్‌కమ్ టాక్స్ అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైఎస్ జయమ్మ జీవితం అందరికీ ఆదర్శం

- పులివెందులలో ఘనంగా వైఎస్ జయమ్మ వర్ధంతి
- నివాళులర్పించిన వైఎస్ విజయమ్మ, ఇతర కుటుంబ సభ్యులు


దివంగత వైఎస్ జయమ్మ సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో వైఎస్ విజయమ్మ, వైఎస్ జార్జిరెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మ, కుటుంబ సభ్యులు, తదితరులు

పులివెందుల : దివంగత వైఎస్సార్ మాతృమూర్తి వైఎస్ జయమ్మ జీవితం అందరికీ ఆదర్శమని దివంగత మహానేత వైఎస్సార్ సతీమణి వైఎస్ విజయమ్మ పేర్కొన్నారు. దివంగత నేత వైఎస్ రాజారెడ్డి సతీమణి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మాతృమూర్తి వైఎస్ జయమ్మ 18వ వర్ధంతిని పులివెందులలో ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాల రోడ్డులో ఉన్న వైఎస్ జయమ్మ, వైఎస్ రాజారెడ్డి ఘాట్‌ల వద్ద వైఎస్ విజయమ్మ, వైఎస్ జార్జిరెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మ, వైఎస్ వివేకా సతీమణి సౌభాగ్యమ్మ, వైఎస్సార్ సోదరుడు వైఎస్ సుధీకర్‌రెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడే ఉన్న దివంగత వైఎస్ జార్జిరెడ్డి, దివంగత వైఎస్ వివేకానంద రెడ్డి, దివంగత డాక్టర్ ఈసీ గంగిరెడ్డి ఘాట్‌లతోపాటు ఇతర కుటుంబ సభ్యుల సమాధుల వద్ద పూలమాలలు వేసి వైఎస్ విజయమ్మ ఘనంగా నివాళులర్పించారు. అంతకుముందు పాస్టర్లు నరేష్ కుమార్, మృత్యుంజయుల ఆధ్వర్యంలో వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వీరు వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి వైఎస్ జయమ్మ పార్కుకు చేరుకుని అక్కడున్న వైఎస్ జయమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్ విజయమ్మ మాట్లాడుతూ వైఎస్ జయమ్మకు తమ కుటుంబంలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. పులివెందుల ప్రాంతంలో ఎవరికి కష్ట మొచ్చినా తన బిడ్డలకు కష్టం వచ్చినట్లుగా భావించేవారన్నారు. వైఎస్సార్‌ను మాట తప్పని.. మడమ తిప్పని నేత గానూ, ఆ తర్వాత ముఖ్యమంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టడం వెనుక వైఎస్ జయమ్మ పాత్ర ఎంతో ఉందన్నారు. ఆమె జీవితాన్ని మనమందరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తర్వాత భాకరాపురంలోని జీసెస్ చారిటీస్‌లోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివేకానందరెడ్డి బామర్ది శివప్రకాష్‌రెడ్డి, సీఎం కార్యాలయ కోఆర్డినేటర్ జనార్దన్‌రెడ్డి, వేంపల్లె మాజీ జెడ్పీటీసీ డాక్టర్ బాషా, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, కౌన్సిలర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తాపీ మేస్త్రీలకు బీమా బాండ్లు

ఒంటిమిట్ట : నిర్మాణ రంగంలో భారతి సిమెంట్‌కు ప్రత్యేక స్థానం ఉందని దృఢత్వం, నాణ్యత కలిగి ఉండడంతోనే కొనుగోలుదారుల నుంచి మద్దతు బాగా పెరిగిందని ఆ సంస్థ టెక్నికల్ జిల్లా ఇంజినీర్ కె.నాగేంద్ర పేర్కొన్నారు. గురువారం ఒంటిమిట్టలోని తాపీ మేస్త్రీలకు భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ నాణ్యతకు మారుపేరుగా నిలిచిన భారతి సిమెంట్ పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. తాపీ మేస్త్రీలకు లక్ష రూపాయలు విలువచేసే ప్రమాద బీమా బాండ్లను అందజేశారు.

మద్యానికి డబ్బు ఇవ్వలేదని భార్య గొంతు కోశాడు!

నిమ్మనపల్లె : వ్యసనాలకు బానిసైన భర్త తాను మద్యం తాగేందుకు భార్య డబ్బులు ఇవ్వకపోవడంతో ఆమెపై పైశాచికంగా దాడిచేసి బ్లేడుతో గొంతుకోసిన సంఘటన గురువారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. వెంగంవారిపల్లె పంచాయతీ చిన్నల్లవారిపల్లెకు చెందిన ఉమామహేశ్వరరెడ్డి వ్యసనాలకు బానిసై మద్యానికి అలవాటుపడ్డాడు. ఈ క్రమంలో కుటుంబాన్ని పట్టించుకోకపోవడంతో.. భార్య అమృత(33) తన ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. అయితే పెద్దమనుషులతో పంచాయితీ చేసి నెలరోజుల క్రితం భార్యాపిల్లలను ఇంటికి తెచ్చుకున్నాడు. అయినా ఉమామహేశ్వరరెడ్డిలో మార్పు రాకపోగా, కుటుంబానికి ఆసరాగా ఉన్న అర ఎకరం పొలం, ఓ పాడి ఆవును అమ్మేశాడు. భర్త ఆగడాలను భరిస్తూ.. అమృత కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. ఈ క్రమంలో గురువారం ఉదయం 6 గంటల సమయంలో ఉమామహేశ్వరరెడ్డి భార్య అమృతతో మద్యానికి డబ్బు ఇవ్వాలంటూ గొడవపడ్డాడు. ఆమె పట్టించుకోకుండా తమ పాడిఆవు వద్ద పాలు పితుకుతుండగా, ఒక్కసారిగా ఆమెపై బ్లేడుతో దాడిచేశాడు. గొంతు కోసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు బాధితురాలిని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఆమెకు ప్రాణాపాయం తప్పింది.

వైభవంగా సీతారాముల పౌర్ణమి కల్యాణం


కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా ఉదయం 10 గంటలకు సీతాసమేతుడైన శ్రీ కోదండ రాముడి కల్యాణం వైభవంగా నిర్వహించారు. తొలుత సీతారాములకు సుగంధ ద్రవ్యాలతో పాటు పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరినీళ్లతో అభిషేకాలు చేశారు. నూతన పట్టువస్త్రాలు ధరింపజేసి, తులసి గజమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం సతీసమేతుడైన శ్రీ కోదండ రామస్వామికి ఆలయ అర్చకులు అంగరంగ వైభవంగా పౌర్ణమి కల్యాణం నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని వీక్షించేందుకులు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

అనాథ పిల్లలకు కేటాయించిన స్థలాన్ని కాపాడండి

మదనపల్లె : మండలంలోని బీకే పల్లె పంచాయతీలో అనాథ పిల్లల కోసం ప్రభుత్వ నిబంధనల ప్రకారం కేటాయించిన భూమిని కబ్జాదారుల కోరల నుంచి కాపాడి వారికి న్యాయం చేయాలని బహుజనసేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు కోరారు. గురువారం సీపీఐ, ఇతర ప్రజాసంఘాల నాయకులతో కలిసి, చైతన్య సర్వీస్ సొసైటీకి చెందిన అనాథపిల్లలతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బీకే పల్లె పంచాయతీ సర్వే నంబర్.548, 540 ప్రభుత్వ భూమిలో అనాథ పిల్లల కోసం సీఎం పేషీ నుంచి వచ్చిన లెటర్ ఆధారంగా సర్వేచేసి.. స్కెచ్‌వేసి కేటాయింపులు జరుపుతుండగా, కొందరు కబ్జాదారులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. తహసీల్దార్ మహబూబ్ చాంద్ నిరసనకారులతో మాట్లాడి, వెంటనే విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

కారు సహా 20 బాక్సుల మద్యం స్వాధీనం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని టి.సదుం పంచాయతీ అంకాలమడుగు చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఐ రవీంద్రబాబు సిబ్బందితో కలసి బుధవారం రాత్రి నాకాబందీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో కర్ణాటక రాష్ట్రం నుంచి ఆంధ్రాకు వస్తున్న కారును అనుమానంతో తనిఖీ చేయగా అందులో 20 బాక్సుల మద్యం ఉన్నట్లు గుర్తించారు. కారు, రూ.63 వేల విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట మండలం సాలాబాద్ గ్రామంలో మంగదొడ్డి పెంచలయ్య అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడని సమాచారం రావడంతో అతని గృహాన్ని సోదా చేశామని ఎస్‌ఐ మధుసూదన్ రావు తెలిపారు. నిలువ ఉంచిన 33 అక్రమ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఉద్యాన పాలిటెక్నిక్ విద్యార్థిని ఆత్మహత్య

కలికిరి : కలికిరిలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పాలిటెక్నిక్‌లో ద్వితీయ ఏడాది విద్యార్థిని గురువారం ఉదయం వసతి గృహం గదిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలం గోపిశెట్టివారిపల్లికి చెందిన వెంకటేష్ కుమార్తె పవిత్ర(17) కలికిరి ఉద్యాన పాలిటెక్నిక్‌లో రెండవ ఏడాది చదువుతోంది. గురువారం ఉదయం వసతి గృహంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించింది. తోటి విద్యార్థినులు, సిబ్బంది గమనించి పోలీసులు, విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. కళాశాలలో ప్రాక్టికల్ పరీక్షలలో ఫెయిల్ కావడంతో ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు విద్యార్థిని సూసైడ్ నోట్ రాసినట్లు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు

వీరబల్లి (రాయచోటి టౌన్) : మండల పరిధిలోని పెద్దివీడు గ్రామం రాగిమాని పల్లె సమీపంలోని మాండవ్య నదిలో ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన టిప్పర్ల ద్వారా ఇసుకను తరలించే ప్రయత్నం చేస్తుండగా గ్రామస్తులు అడ్డగించారు. ఎస్‌ఐ చంద్రమోహన్ అక్కడికి చేరుకొని వారి వద్ద ఉన్న రికార్డులను పరిశీలించి వీరికి అనుమతులు ఉన్నాయి కనుక అడ్డగించడం తగదని వారించారు. దీంతో రైతులు మండల స్థాయి నాయకులను ఆశ్రయించారు. సర్పంచ్ నాగిరెడ్డి, సింగిల్ విండో ప్రెసిడెంట్ అమర్‌నాథరెడ్డి తదితరులు అక్కడికి చేరుకొని ఇసుక తరలింపునకు ప్రభుత్వ అనుమతి లేదని తరలించొద్దని చెప్పారు.

ట్రాఫిక్ సిగ్నల్స్‌తో ప్రమాదాల నివారణ

రాయచోటిలో ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రారంభంలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, ఎస్పీ కృష్ణారావు


ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎస్పీ

రాయచోటి : ట్రాఫిక్ సిగ్నల్స్‌తో ప్రజా రవాణా సులభతరం, ప్రమాదాల నివారణకు ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, ఎస్పీ బి.కృష్ణారావులు పేర్కొన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని చెక్‌పోస్టు శివాలయం వద్ద ప్రధాన కూడలిలో రూ. 18 లక్షలతో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్‌ను మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, వైస్ చైర్మన్‌లు దశరథరామిరెడ్డి, ఫయాజ్ రెహ్మాన్, డీఎస్పీ మహబూబ్ బాషాలతో కలిసి వీరు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిత్యం ట్రాఫిక్ రద్దితో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు సిగ్నల్స్ ఏర్పాటుతో ఇబ్బందులు తప్పుతాయన్నారు. ప్రస్తుతం చెక్‌పోస్టు వద్ద కూడా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయడంతో ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను కూడా ఏర్పాటు చేయించి సీ స్థాయి అధికారిని నియమించామన్నారు. అనంతరం ఎస్పీ బి.కృష్ణారావు మాట్లాడుతూ వాహనాల వినియోగం, రాకపోకలు సైతం పట్టణంలో బాగా పెరిగాయన్నారు. అందువల్ల ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ఎస్పీ సూచించారు.

విద్యుత్ షాక్‌తో డోజర్ డ్రైవర్ మృతి

కలికిరి : మండలంలోని గుండ్లూరు కాలనీ సమీపంలో డోజర్‌తో ప్రైవేటు పనులు చేస్తున్న డ్రైవర్ కళ్యాణ్(38) విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలు... గుండ్లూరు సమీపంలో పీలేరు పట్టణానికి చెందిన సుధాకర్ ప్రైవేటు లే అవుట్ ఏర్పాటు చేస్తున్నాడు. ఇందుకు గాను సుమారు 5 నుంచి 6 అడుగులు ఎత్తు మట్టి తోలారు. మట్టి చదును చేసేందుకు డోజర్‌ను తీసుకువచ్చారు. ఇది గమనించిన గుండ్లూరు ట్రాన్స్‌కో లైన్‌మెన్ బుధవారం అక్కడికి చేరుకుని మట్టి ఎత్తుగా ఉండటంతో విద్యుత్ లైన్ ప్రమాదం పొంచి ఉందని, డోజర్‌తో పనులు చేయకూడదని యజమాని సుధాకర్‌ను హెచ్చరించారు. అయినా గురువారం అక్కడ డోజర్‌తో పనులు చేపట్టడంతో విద్యుత్ లైన్ తగిలి ఖాజీపేటకు చెందిన డ్రైవర్ కళ్యాణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ట్రాన్స్‌కో ఏఈ ముజీబుర్ రెహ్మాన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, స్థలం యజమాని, డోజర్ యజమానిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తల్లి, ముగ్గురు పిల్లలు అదృశ్యం

చిన్నమండెం : తల్లి తన ముగ్గురు పిల్లలతో కలిసి అదృశ్యమైన సంఘటన మండల పరిధిలోని శ్రీరామ్‌నగర్‌కాలనీలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. భార్గవి అనే మహిళ తన ముగ్గురు పిల్లలు రూపేష్, చరిష్మా, నిష లతో కలిసి అత్తగారి ఊరైన చాకిబండ కుమ్మరిపల్లికి వెళ్తానని చెప్పి ఈ నెల 23వ తేదీ సాయంత్రం 3 గంటల సమయంలో ఇంటి నుంచి బయలుదేరింది. శ్రీరామ్‌నగర్ కాలనీ నుంచి ఆటోలో వెళ్తున్నపుడు ఆమె తల్లి చూసింది. ఈమె భర్త కువైట్‌లో ఉంటున్నాడు. అదే తేదీన అత్తగారింటికి చేరి అక్కడ తోడికోడలు, అత్తతో గొడవపడి రాత్రి 7 గంటల సమయంలో అంగడికి వెళ్లివస్తానని చెప్పి పిల్లలతో వచ్చేసింది. భార్గవి తల్లి కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆటో ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

నిమ్మనపల్లె : ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొనడంతో యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం రాత్రి నిమ్మనపల్లె మండలంలో జరిగింది. మదనపల్లె మండలం సీటీఎం పంచాయతీ దయ్యాలోల్లపల్లెకు చెందిన ఉమాపతి(25) వ్యక్తిగత పనులపై బుధవారం సాయంత్రం నిమ్మనపల్లెలోని బంధువుల ఇంటికి వచ్చాడు. తిరిగి రాత్రి ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వచ్చేందుకు మదనపల్లెకు వస్తుండగా, మార్గమధ్యంలో రెడ్డివారిపల్లె వద్ద ఎదురుగా వచ్చిన ఆటో ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో ఉమాపతి తీవ్రంగా గాయపడగా, గమనించిన స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. నిమ్మనపల్లె పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కారు ఢీకొని యువకులకు తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన తేజు

మదనపల్లె : ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలైన ఘటన గురువారం జరిగింది. మదనపల్లె పట్టణం ఎగువకురవంకలో నివాసం ఉంటున్న గౌస్ ములకలచెరువు తహసీల్దార్ కార్యాలయంలో ఏటీగా పనిచేస్తున్నారు. గురువారం సాయంత్రం విధులు ముగించుకుని మదనపల్లెకు తిరిగి వస్తున్నారు. అంగళ్లుకు చెందిన తేజు(20), మునాఫ్(20)లు ఇద్దరూ స్నేహితులు. ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వచ్చి అంగళ్లుకు తిరిగి ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో కురబలకోట మండలం చేనేతనగర్ వద్ద కారు, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో కారు అద్దాలు పగిలి కారు నడుపుతున్న గౌస్ గాయపడగా, ద్విచక్రవాహనంలో ప్రయాణిస్తున్న తేజు, మునాఫ్‌కు తీవ్రగాయాలయ్యాయి. వీరిలో తేజుకు కాలు విరగడంతో పాటు తలకు గాయమై పరిస్థితి విషమంగా ఉంది. ప్రథమ చికిత్స అనంతరం జిల్లా ఆస్పత్రి వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

28 నుంచి రాజంపేటలో క్రీడా పండుగ

- దేశం నలుమూలల నుంచి రానున్న కబడ్డీ క్రీడారులు
- రేపు వివిధ రాష్ట్రాల క్రీడాకారులతో పట్టణంలో భారీ ర్యాలీ
- జాతీయ స్థాయి కబడ్డీ పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- డీఈఓ శ్రీరామ్ పురుషోత్తం


మాట్లాడుతున్న డీఈఓ శ్రీరామ్ పురుషోత్తం

రాజంపేట టౌన్ : ఈనెల 28వ తేదీ నుంచి రాజంపేట పట్టణంలోని ఇన్‌ఫ్యాంట్ జీసెస్ హైస్కూల్‌లో ఎస్‌జీఎఫ్ అండర్-14 67వ జాతీయ స్థాయి బాలికల కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం తెలిపారు. పట్టణంలోని ఇన్‌ఫ్యాంట్ జీసెస్ హైస్కూల్‌లో గురువారం స్కూల్‌గేమ్స్ రాష్ట్ర సెక్రెటరి జి.భానుమూర్తిరాజుతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఈఓ మాట్లాడారు. దేశవ్యాప్తంగా 27 జట్లు, 327 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. అలాగే, యాభైమంది కోచ్‌లు, మేనేజర్లు కూడా వస్తారన్నారు. క్రీడాకారులకు ఇంటిగ్రేటెడ్ హాస్టల్, గర్ల్స్ హైస్కూల్, ఇన్‌ఫ్యాంట్ జీసెస్ హైస్కూల్‌లో వసతి సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. మేనేజర్లు, కోచ్‌లకు పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్, కల్యాణ మండపాల్లో, పలు లాడ్జీలలో వసతి సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 26వ తేదీ రాత్రి నుంచే వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు రాజంపేటకు రానున్నట్లు తెలిపారు. పోటీల ప్రారంభ, ముగింపు వేడుకలకు మంత్రులు, రాష్ట్ర స్థాయి అధికారులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. స్కూల్‌గేమ్స్ రాష్ట్ర సెక్రెటరి జి.భానుమూర్తిరాజు మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు రానుండటంతో రాజంపేట, కడప, రేణిగుంట రైల్వేస్టేషన్లలో రిసెప్షన్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. క్రీడాపోటీలు జరిగినన్ని రోజులు క్రీడాకారులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ఉండేందుకు, అలాగే పోటీలు సాఫీగా సాగేందుకు 26 కమిటీలను వేసినట్లు తెలిపారు. రోజుకు ఇరవై మ్యాచ్‌లు జరుగుతాయని అందుకోసం మ్యాట్‌తో కూడిన కోర్టులను సిద్ధం చేస్తున్నామన్నారు. అవసరమైతే ఫ్లడ్‌లైట్ల వెలుగులో రాత్రి వేళలో కూడా పోటీలు జరుపుతామన్నారు. ఈనెల 27వ తేదీ సాయంత్రం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులతో ఇన్‌ఫ్యాంట్ జీసెస్ హైస్కూల్ నుంచి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ డీఈఓ వరలక్ష్మీ, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరి వసంత, ప్రెస్ లైజన్ ఆఫీసర్ సీవీ రమణయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు.

నవశకం

ఇంటి వద్దకే ధ్రువీకరణ పత్రాలు



ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఇంటి వద్దకే మా పిల్లలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు వచ్చాయి. గతంలో ధ్రువీకరణ పత్రాలు కావాలంటే మండల కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. అవి ఎప్పుడు వస్తాయో కూడా తెలియని పరిస్థితి. ఇటీవల నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అవసరమైన ధ్రువీకరణ పత్రాలన్నీ సచివాలయం ద్వారానే వస్తాయని వలంటీర్ ప్రవీణ్ చెప్పడంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నాము. రెండు రోజుల వ్యవధిలోనే దరఖాస్తు చేసుకున్న ధ్రువీకరణ పత్రాలన్నీ ఉచితంగానే అందజేశారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలన్నీ కూడా వలంటీర్ ద్వారా ఇంటి వద్దకే అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మేము ఎప్పటికీ రుణపడి ఉంటాము. – ఏనుగు వెంగమ్మ, కాలువపల్లె, గోపవరం మండలం

అమ్మఒడితో ఆసరా



మేము బద్వేలు పట్టణంలోని 7వ వార్డులో గల బెస్తవీధిలో నివసిస్తున్నాము. నా భర్త ఆటో నడుపుతారు. మా కుమారుడు తేజ రాచాయపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్నాడు. గతంలో పిల్లవాడి చదువుకు సంబంధించిన పుస్తకాలు, బ్యాగు తదితరాలకు వేలల్లో డబ్బు ఖర్చయ్యేది. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రిగా జగనన్న వచ్చాక ప్రతి ఏటా అమ్మఒడి కింద ఇచ్చే రూ.15 వేలు సాయం మాకెంతో ఆసరాగా నిలుస్తోంది. అలాగే గతంలో కంటే బడి రూపురేఖలు కూడా బాగుపడ్డాయి. నా భర్తకు వాహనమిత్ర ద్వారా ప్రతి ఏటా రూ.10 వేలు అందుతోంది. జగనన్నకు ధన్యవాదాలు. – బి.రమాదేవి, బెస్తవీధి, బద్వేలు

నెరవేరిన సొంతింటి కల



దాదాపు ఏళ్ల తరబడి అద్దె ఇంట్లో బతుకుతున్నాం. కూలి పనులకు వెళితే జీవనోపాధి గడవడం కష్టంగా ఉంది. కనీసం సొంతిల్లు ఉంటే అద్దె డబ్బులన్నా మిగులుతాయని కలలు కనేవాళ్లం. గత ప్రభుత్వంలో మా గోడు పట్టించుకునేవారే లేరు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వలంటీర్ ఇంటి వద్దకు వచ్చి ఇంటి పట్టా ఇవ్వడమేకాక బిల్లు కూడా మంజూరై సొంతింటి కల నెరవేర్చుకున్నాం. – గౌసియా, గురిజాల, సింహాద్రిపురం

వృద్ధురాలిని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

మదనపల్లె : ఆర్టీసీ బస్టాండు వద్ద గురువారం మదనపల్లె-రాయచోటి సర్వీసు ఆర్టీసీ బస్సు బస్టాండ్ లోపలికి వచ్చే క్రమంలో మలుపు తిరుగుతుండగా, అటుగా వెళుతున్న ఓ గుర్తుతెలియని వృద్ధురాలిని ఢీకొంది. ప్రమాదంలో వృద్ధురాలి కాలు, చేయి నుజ్జునుజ్జు అయ్యాయి. ప్రమాదాన్ని గుర్తించిన వెంటనే బస్సు డ్రైవర్, కండక్టర్‌లు 108 అంబులెన్స్‌కు ఫోన్‌చేసి, బాధితురాలిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితురాలు తన పేరు ఫాతిమా(60), ఇందిరానగర్‌గా పేర్కొంది. అయితే ఇందిరానగర్‌లో ఆ పేరు కలిగిన వ్యక్తులు ఎవరూ లేరని తెలిసింది.

ఉపయోగంలో లేని చెక్కులు దహనం

రాయచోటి : అన్నమయ్య జిల్లా ఖజానా అధికారి పరిధిలో ఎనిమిది ఉప ఖజానా కార్యాలయాలలో ఉపయోగంలో లేని చెక్కు బుక్కులను దహనం చేసినట్లు జిల్లా ఖజానా అధికారి సయ్యద్ మహబూబ్ తెలిపారు. గురువారం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఆదేశాల మేరకు డీఆర్‌ఓ సత్యనారాయణ పర్యవేక్షణలో కాల్చివేశారు. జిల్లా అడిషనల్ ఎస్పీ, జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా రిజిస్టర్, జిల్లా అగ్నిమాపక దళ అధికారి, జిల్లా ఖజానా అధికారుల సమక్షంలో ఉపయోగంలో లేని 4380 చెక్కు బుక్కులను దహనం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సహాయ ఖజానా అధికారి ఎం.ఖాదర్ వలీ పాల్గొన్నారు.